తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## స్పందనకు 185 అర్జీలు



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త:
సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల ప్రజల నుండి 185 అర్జీలు అందాయి. కలెక్టరేట్‌లో ఈ వారం స్పందన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 148 అర్జీలు అధికారులకు అందగా వీటిని సత్వరం పరిశీలించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 4న సిఎం జగన్ చిత్తూరు పర్యటన



చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త:
సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జులై 4న చిత్తూరు పర్యటన కోసం విచ్చేస్తున్నారని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సిఎం వైఎస్ జగన్ చిత్తూరు పర్యటన విజయవంతం చేయడానికి కలెక్టర్ సగిలి షన్మోహన్ సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిం చారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి జులై 4న చిత్తూరు నగర పర్యటనకు విచ్చేస్తున్నారని, అన్ని శాఖల అధికారులు వారికి నిర్ధేశించిన విధులను పక్కాగా నిర్వర్తించి సిఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డ్వామా పిడి గంగా భవానీ, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, హౌసింగ్ పిడి పద్మనాభం, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ,ఉద్యానశాఖ డిడి ప్రభాకర్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్రరెడ్డి, డిఎల్‌డిఎ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోడితోనే రాష్ట్రాభివృద్ధి

### కేంద్ర మంత్రి దేవ సింగ్ చౌహాన్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి దేవ సింగ్ చౌహాన్

చిల్లకూరు, జూన్ 26, ప్రభాతవార్త
ఆంధ్రరాష్ట్రం అభివృద్ధి చెందిందంటే భారత ప్రధాని నరేంద్ర మోడీతోనే అని కేంద్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దేవ సింగ్ చౌహాన్ అన్నారు. సోమవారం రాష్ట్ర బిజేపి అధ్యక్షులు సోము వీర్రాజుతో కలిసి మండలంలోని పారిచర్లవారిపాలెం గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించడం జరిగింది. అనంతరం ఉపాధి కూలీలతో పలు విషయాలు మాట్లాడి అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం ఇంత అభివృద్ధి జరిగిందంటే ప్రధాన మోడితోనే అని, గత తెలుగు దేశం పార్టీ హయాంలో 35 వేల కోట్ల రూపాయిలు అభివృద్ధికి ఇవ్వడం జరిగిందని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 40 వేల కోట్ల రూపాయిలు ఇవ్వడం జరిగిందని అన్నారు. దేశంలోనే బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకంటే ఎక్కువ నిధులు 2014 నుంచి ఇప్పటి వరకు ఇవ్వడం జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన నిధులకంటే ఎక్కువగా ఉపాధి హామీ పథకంకు ఇవ్వడం జరిగిందని కేంద్ర ప్రభుత్వం అనేక విధాల అభివృద్ధి చేయడం సంతోషదాయకమన్నారు. దేశంలో లక్ష కోట్లు అభివృద్ధికి కేటాయించడంతో ఆంధ్రప్రదేశ్‌కే ఎక్కువ శాతం నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి రోజుకు వెయ్యి రూపాయిలు లబ్ధిచేకూరుతుందని వారు తెలిపారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నందుకు 2024లో జరిగే ఎన్నికల్లో నరేంద్ర మోడిని ప్రధాన మంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత ఉపాధి కూలీలపై ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీతో కలిసి ఎన్నికల బరిలో దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పొన్నారెడ్డి దయాకర్ రెడ్డితో పాటు నాయకులు కోలా ఆనంద్, పాకారెడ్డి పురుషోత్తం రెడ్డి, పనబాక కోటేశ్వర రావు, గిరిధర్ రెడ్డి, చిల్లకూరు మండలాధ్యక్షులు అళ్ళగుంట సుబ్రమణ్యం, ఏపిడిఓ రవికుమార్ నాయుడు, ఎంపిడిఓ గోపినాథ్, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, బాలకృష్ణమ నాయుడు, ప్రకాష్ నాయుడు, భాషా, తదితర నాయకులు పాల్గొన్నారు.

# యువ న్యాయవాదులకు ప్రభుత్వం అండ

- అర్హులైన యువ న్యాయవాదుల బ్యాంకు ఖాతాలకు రూ.5 వేలు జమ
- వైఎస్ఆర్ లా నేస్తం కార్యక్రమంను బటన్ నొక్కి ప్రారంభించిన సిఎం వైఎస్ జగన్

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త:
నాల్గవ విడత వైఎస్ఆర్ లా నేస్తం కార్యక్రమంలో భాగంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తం ఏడాదికి 2,766 మంది జూనియర్ లాయర్లకు 6.12 కోట్ల రూపాయలు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నామని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి సోమవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి నాల్గవ విడత వైఎస్ఆర్ లా నేస్తం లబ్ధికి అర్హులైన జూనియర్ లాయర్ల బ్యాంకు ఖాతాలకు లబ్ధిని జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సిఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు వాళ్ళ కాళ్ళపై వారు నిలబడటానికి తోడుగా న్యాయవాదులు లా కోర్సు పూర్తి చేసిన మొదటి మూడు సంవత్సరాల్లో ప్రాక్టీసు పరంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం వుంటుందని అప్పుడు చదువులు పూర్తయి కోర్టుల్లో అడుగు పెడుతున్న పరిస్థితుల్లో వారి కాళ్ళపై వాళ్ళు నిలబడటానికి ప్రతి నెల 5 వేల రూపాయలు చొప్పున ఏడాదికి 60 వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. మూడేళ్ళలో ఒకొక్క జూనియర్ లాయర్‌కు 1.80 లక్షల రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. 2019 సంవత్సరంలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా నాలుగు సంవత్సరాల్లో 5,781 మంది న్యాయవాదులకు 41.52 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. అలాగే అడ్వకేట్లకు అన్ని రకాల మంచి జరుగాలనే ఉద్దేశంతో 100 కోట్ల రూపాయలతో అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో ఇప్పటికే వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మెడిక్లైములు, న్యాయవాదులకు అవసరమైన రుణాలు వంటి వాటి కోసం ఈ ఫండ్ నుండి 25 కోట్ల రూపాయల సహాయం అందించడం జరిగిందన్నారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా నాలుగేళ్ళలో అడ్వకేట్లకు రాష్ట్ర ప్రభుత్వం నిజంగా తోడు వుందనే సంకేతం వెళ్ళిందన్నారు. జిల్లాలోని 97 మంది జూనియర్ లాయర్లకు నాల్గవ విడత వైఎస్ఆర్ లా నేస్తం ద్వారా స్టైఫండ్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ నుండి వర్చువల్ విధానంలో కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, రాష్ట్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల సలహాదారులు జ్ఞానేంద్రరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, జడ్పీ మహిళా స్థాయి సంఘ కమిటీ ఛైర్మన్ భారతి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ లానేస్తం ప్రారంభ కార్యక్రమానికి వర్చువల్ విధానంలో హాజరైన కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

## అర్ధరాత్రి ఇంట్లో పేలిన బాణసంచా బాంబు..

### ఇద్దరికి తీవ్రగాయాలు
### కుప్పం కొత్తపేటలో కలకలం.. పోలీసుల దర్యాప్తు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్యభర్తలు

కుప్పంరూరల్, జూన్ 26 ప్రభాతవార్త
కుప్పం పట్టణం కొత్తపేటలో ఆదివారం అర్ధరాత్రి దాటాక ఓ ఇంట్లో బాణసంచా బాంబు భారీ శబ్దంతో పేలింది. దీంతో ఇంట్లో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈసంఘటన కుప్పంలో కలకలం రేకెత్తించింది. ఈసంఘటనకు సంబంధించి ఎస్సై శివకుమార్ తెలిపిన మేరకు వివరాలిలా.. కొత్తపేటలో బొరుగుల రాణెమ్మ కాంపౌండ్‌లో మురుగేష్, ధనలక్ష్మిలు కాపురం ఉంటున్నారు. వీరు స్టీలు పాత్రలు విక్రయించి జీవనం సాగించేవారు. ఆదివారం అర్ధరాత్రి వీరి ఇంట్లో ఒక్కసారిగా బాంబు పేలింది. బాంబుధాటికి మురుగేష్, ధనలక్ష్మిలకు తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శాస్త్రోక్తంగా 12రకాల పుష్పాలతో గోవిందరాజునికి పుష్పయాగమహోత్సవం



తిరుపతి,జూన్ 26ప్రభాతవార్త :బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత బ్రహ్మోత్సవాల్లోగానీ, నిత్యకైంకర్యాల్లోగానీ అర్చకుల పరిచారకుల వల్ల,అధికారులు, భక్తుల వల్ల తెలిసీతెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం జరిపిస్తారు. గోవిందరాజస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 12 రకాల సాంప్రదాయ పుష్పాలు,తులసి, మరువం,దవనం ,బిల్వం, పన్నీరాకు పత్రాలు మొత్తం కలిపి 3టన్నులతో స్వామిఅమ్మవార్ల పాదాలు స్పృశిస్తూ గోవిందా...గోవిందా అందరినీ చల్లగా చూడవయ్యా అంటూచఅర్చకులు వేడుకున్నారు.

## గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు విహారం

### ముగిసిన సాక్షాత్కార వైభవోత్సవాలు



చంద్రగిరి, జూన్ 26 ప్రభాతవార్త:
భక్తజనుల గోవింద నామస్మరణల నడుమ శ్రీ మహావిష్ణువు తన నిత్య వాహనమైన గరుడ వాహన సేవ సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి సాక్షాత్కార వైభవోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు ఆలయ ఆవరణలో స్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతుడై ఊజంల్‌పై సేదదీరారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్స్ టి.వెంకటస్వామి, నర్రా మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, అర్చకులు శేషాచార్యులు, నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పందన, జగనన్నకు చెబుదాం వినతులకు పరిష్కారం చూపాలి

### కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతి కలెక్టరేట్, జూన్ 26, ప్రభాతవార్త
స్పందన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన వినతులపై 24 గంటలలో పరిష్కారం చూపాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదని, పరిష్కరించిన వినతులు రీ ఓపెన్ కారాదని జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై ప్రభుత్వ శాఖలకు అందిన వినతులు పరిష్కారంపై సమీక్ష నిర్వహిస్తూ పురోగతి చూపని మండల అధికారులను పంచాయితీ సచివాలయ సిబ్బందిని వర్చువల్ విధానంలో మాట్లాడి అలసత్వం ప్రదర్శించిన వారికి మంగళవారం మెమోలు ఇవ్వాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచనలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలలో స్పందన జగనన్నకు చెబుదాం సురక్ష కార్యక్రమాలపై ప్రాధాన్యత ఇవ్వాలని ప్రగతి చూపనిపక్షంలో తప్పనిసరి మొదటిసారి షోకాజ్ నోటీసులు, రెండవ సారి ఆలసత్వం జరిగితే సస్పెన్షన్ తప్పదని అన్నారు. పలు మండలాలలో పురోగతి చూని, 24 గంటల లోపు అందిన వినతులను యాప్‌లో చూడని సిబ్బంది అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.అలసత్వం చూపిన పలువురు సచివాలయ సిబ్బంది జిల్లా కలెక్టరేట్‌కు హాజరై షోకాస్ నోటీసులు తీసుకోవాలని సంబంధిత అధికారులు నోటీసులను సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. సమీ క్షలో అడిషనల్ ఎస్పి వెంకటరావు, డిఆర్ఓ కోదండరా ంరెడ్డి, తిరుపతి ఆర్డివో కనక నరసారెడ్డి, డిఎల్‌డిఓ సుశీల దేవి, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, జిల్లా అధికారులు, జిల్లా సురక్ష టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొనగా వర్చువల్ విధానంలో మండల, సచివాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్ ఫ్రీ చిత్తూరు జిల్లాగా తీర్చదిద్దడమే లక్ష్యంగా అడుగులు

### - ఎస్పీ రిశాంత్‌రెడ్డి



చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త:
డ్రగ్ ఫ్రీ చిత్తూరు జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేయాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు నగరం గాంధీ కూడలి ఆవరణలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఎస్ఇబి పోలీసులతో కలిసి వెయ్యి మంది విద్యార్థులతో చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవవ్యాలపై ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి జిల్లా పోలీసులు, ఎస్ఇబి పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఎఎస్పీ జె.నాగేశ్వరరావు, నగర డిఎస్పీ కె.శ్రీనివాసమూర్తి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, డిటిసి డిఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏఆర్ డిఎస్పీ మురళీధర్, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ మద్దయ్యచ్చారి, వెస్ట్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, డిటిసి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, అడ్మిన్ ఆర్ఐ నీలకంతేశ్వరరెడ్డి, ఎంటిఓ మధు, నగర ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత భారతదేశం సాధనే అంతిమ లక్ష్యం

### జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి



తిరుపతి క్రైం, జూన్ 26, ప్రభాతవార్త
ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం లేని అంతర్జాతీయ సమాజాన్ని సాధించాలనే లక్ష్యంతో, దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాలనే సంకల్పానికి వ్యక్తీకరణగా ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం జూన్ 26 వ తేదిన అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం అక్రమ రాణా వ్యతిరేక దినోత్సంగా నిర్వహించారు. జిల్లా పోలీసులు, స్పెషల్ ఎనోఫోర్స్‌మెంట్ వారు జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం రోడ్డులోని జిల్లా ఎస్పి కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణ రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎస్వీయూ ఆడిటోరియం వరకు సాగింది. అనంతరం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియం నందు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## శివయ్య సేవలకు తగ్గేదే లే . . .



శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు తగ్గేదేలే అంటున్నారు. ఓ వైపు సామాన్య భక్తులు,మరో వైపు విఐపిలతో ఆలయం కిట కిట లాడుతుంది. ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమౌతుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భద్రత కల్పించటంలో పోలీసులు ఎంతో జవాబుదారి తనంతో వ్యవహారిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి ఆలయంలో హరహరమహాదేవా శంభోశంకరా అంటూ స్మరించుకుంటూ కనబడ్డారు. ఓ వైపు స్వామి అమ్మవార్ల దర్శనాలు మరో వైపు రాహుకేతుదోష నివారణ పూజలకు భక్తులు పడిగాపులు పడుతున్నారు. సంస్కరణలతో కొందరు అధికారులు బదిలిఅయ్యారు. దాంతో ఆలయంలో పర్యవేక్షణ కొరవడింది. ఛైర్మెన్ కంచుగడప వద్ద టిక్కెట్లు పరిశీలనలో నిమగ్నమౌతున్నారు. కానీ భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పట్టించుకునే నాధుడు లేదు.ఇఓ నాలుగు రోజులిక్కడ మిగిలిన మూడు రోజులు తిరుపతిలో అనే సంకేతాలతో ఇక్కడ కొన్ని ఇబ్బందులు ఎదురౌతున్నాయి. సోమవారం సాయంత్రం అధికారికంగా అందించిన సమాచారం మేరకు సుమారు 27వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

## అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



తవణంపల్లె, జూన్ 26 ప్రభాతవార్త: మండల కేంద్రం తవణంపల్లెలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ర్యాలీ, మానవహారం కార్యక్రమంను నిర్వహించారు. జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై పి.వి.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మహిళా పోలీసులు, తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులచే పోలీస్‌స్టేషన్ నుండి టి.పుత్తూరు రోడ్డు వరకు మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి.పుత్తూరు రోడ్డులో మానవహారం నిర్వహించారు. ఏఎస్సై రాజేంద్ర, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ కార్మికుల ధర్నా



పాలసముద్రం, జూన్ 26 ప్రభాతవార్త: తమకు చెల్లించాల్సిన జీతాలను సత్వరం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎంపిడిఓ కార్యాలయం ఎదుట స్వచ్ఛ భారత్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ కార్మికులు మాట్లాడుతూ మండల పరిధిలో 13 పంచాయతీల్లో స్వచ్ఛ భారత్ కార్మికులు 32 మంది వున్నామని అయితే తమకు 14 నెలల నుండి జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోడి ఈ కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించడంతో గ్రామాలు పరిశుభ్రతే ధ్యేయంగా స్వచ్ఛ భారత్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ మేరకు కార్మికులు ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను కలిసి తమ జీతాల సమస్యలను విన్నవిస్తే సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామన్నారు.

## తవణంపల్లెలో మలేరియా నివారణ చర్యలు

తవణంపల్లె, జూన్ 26 ప్రభాతవార్త: మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం మండలంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. జిల్లా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరు సాహెబ్, మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంకల ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా మండల కేంద్రం తవణంపల్లె బిసీ కాలనీ సమీపంలోని కుంటలో, సరకల్లు గ్రామ సచివాలయ పరిధిలోని జి.గొల్లపల్లె గ్రామ సమీపంలోని కుంటలలో దోమల లార్వాలను నిర్మూలించేందుకు గంబూజియా చేప పిల్లలను వదిలిపెట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నారాయణ, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

## టెంపో ఢీకొని వ్యక్తి మృతి

బంగారుపాళ్యం, జూన్ 26 ప్రభాతవార్త: చెన్నై-బెంగుళూరు రహదారికి బలిజపల్లె సమీపంలో ఆదివారం రాత్రి టెంపో ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పలమనేరు రూరల్ మండలం మంచినీళ్ళ కుంట గ్రామానికి చెందిన నీలకంఠ(41) ద్విచక్రవాహనంలో గంగాధరనెల్లూరుకు వెళ్ళి తిరిగివస్తూ ప్రమాదానికి గురయ్యాడు. ద్విచక్రవాహనంలో పెట్రోల్ అయిపోవడంతో పెట్రోల్ కోసం రోడ్డు దాటుతుండగా పలమనేరు నుండి చిత్తూరు వైపు వస్తున్న టెంపో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నీలకంఠ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈమేరకు ఎస్సై రాంభూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంగపుత్రులచే కుమారరాజాకు సన్మానం

బంగారుపాళ్యం, జూన్ 26 ప్రభాతవార్త: పాలేకిరి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన ఎంబి.కుమారరాజాను సోమవారం గంగపుత్రులు ఘనంగా సన్మానించారు. ఆయనను దుశ్శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బీసీ కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అలాగే గంగపుత్రులకు కమ్యూనిటీ భవనం మంజూరు చేయించాలని కోరారు. ఈకార్యక్రమంలో గంగపుత్రుల కేశవులు, నాగరాజు, రాజేంద్ర, ఉమాపతి, రెడ్డెప్ప, బాలాజీ, వెంకటేష్, హేమంత్, చంద్రకాంత్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ సేవలో మాజీ జేడి లక్ష్మీనారాయణ

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 26 ప్రభాతవార్త: శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను సిబిఐ మాజీ జేడి లక్ష్మీనారాయణ దర్శించుకొన్నారు. ఆయనకు అధికార, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. చౌడేపల్లికి చెందిన భవానీ తదితరులు ఆయన వెంట వున్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అడుగులు

### మీట్ ది ప్రెస్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం వైకాపా ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా చేసిన అభివృద్ధిని వివరించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పలు పథకాలకు శ్రీకారం చుట్టి పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అర్హతే ప్రమాణీకంగా అందిస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలో మొత్తం 78 గ్రామ, వార్డు సచివాలయాలు వుంటే అందులో 70 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేశామన్నారు. చిత్తూరు నగర పరిధిలోని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుల్లో కలపడానికి ఎంపీ లాండ్స్ కింద నిధులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. చిత్తూరు నగర ప్రజల శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం కోసం చామంతిపురం వద్ద 5 టిఎంసిల నిల్వ వుండే విధంగా రిజర్వాయర్‌ను నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చంద్రగిరి నియోజకవర్గంలో కొంత భాగం మంచినీటి సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేక ప్రాధాన్యత

### -మదర్‌థెరిసా కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు

గంగవరం, జూన్ 26, ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్తుకు మదర్‌థెరిసా కళాశాల ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తుందని కరస్పాండెంట్ రవీంద్ర బాబు తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం గ్రాడ్యుయేష్ డే, ప్లేస్‌మెంట్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవీంద్ర బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.రాజేంద్రా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు వారికి పలు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తు వారి అభివృద్ధికి కళాశాల కృషి చేస్తుందన్నారు. ప్రతి ఏటా వేల సంఖ్యల విద్యార్థులు విద్యను పూర్తి చేసుకుని ప్రఖ్యత కంపెనీలలో ఉద్యోగాలు పొంది కళాశాల నుండి వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సునీల్ ప్రిన్సిపాల్ డా.లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నివారణకు యువత కృషి కీలకం –డిఎస్పీ

పలమనేరు, జూన్ 26, ప్రభాతవార్త: మాదక ద్రవ్యాల నివారణకు యువత కృషి కీలకమని పలమనేరు డిఎస్పీ సుధాకర్ తెలిపారు. సోమవారం ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ అధిక శాతం యువత మాదక ద్రవ్యాల మత్తులో వారి జీవితాలను పోగొట్టుకుంటున్నారని యువత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వాటి నివారణకు కృషి చేసినప్పుడే వాటి నివారణ సాధ్యమౌతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ చంద్రశేఖర్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశాల సద్వినియోగంతో ఉన్నత శిఖరాలకు : మిద్దింటి



చౌడేపల్లి, జూన్ 26 ప్రభాతవార్త: యువత అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ అన్నారు. స్థానిక ఉన్నతపాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ వారిచే వివిధ రకాల ప్రయోగాలతో ముద్రించబడ్డ పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసారు. మానవ జీవితం సైన్స్‌తో ముడిపడి వుందనీ, పిల్లలు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే అనుకొన్న లక్ష్యాలను చేరుకొంటారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, లోకసభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిల ఆధ్వర్యంలో పాఠశాలలకు మౌళిక వసతులు సమకూరుతున్నాయనీ, విద్యకు ప్రాధాన్యత యువతకు ఉద్యోగ కల్పనలో పెద్దిరెడ్డి కుటుంబం అహర్నిశలూ కృషి చేస్తోందన్నారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు గాజుల మోహన్, మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## డ్రగ్స్ రహిత రాష్ట్రంకు యువత కృషి చేయాలి - సెబ్ సిఐ



కుప్పం, జూన్ 26 ప్రభాతవార్త: రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు యువత కృషి చేయాలని కుప్పం సెబ్ సిఐ కిషోర్‌కుమార్, అర్బన్ ఎస్సై శివకుమార్ సూచించారు. సోమవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కుప్పం పట్టణంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూయువత గంజాయి, ఇతర డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత సన్మార్గంలో పయనించి భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. మహిళా పోలీసులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీలో ప్రశాంతంగా యుజి సెమిస్టర్ పరీక్షలు



కుప్పం, జూన్ 26 ప్రభాతవార్త: ద్రవిడ వర్సిటీలో యుజి సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. వర్సిటీ ఉప కులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ, రెక్టార్ ఆచార్య అనురాధ, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల రెడ్డిలు వర్సిటీలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ముగిసిన వెంటనే ఫలితాలు త్వరగా వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య లోకనాథం, పరీక్షల డీన్ ఆచార్య అరవింద్‌కుమార్, కంట్రోలర్ డా॥ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం..

### పోలీసుల మెరుపుదాడులు- ఒకరి అరెస్ట్.. ముగ్గురిపై కేసు నమోదు

కుప్పం, జూన్ 26 ప్రభాతవార్త: కుప్పం పట్టణం కృష్ణగిరి బైపాస్ రోడ్‌లో స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న కేంద్రంపై సోమవారం మెరుపుదాడులు జరిపినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కృష్ణగిరి బైపాస్ రోడ్‌లో యోగా ఆయుర్వేదిక్ స్పా సెంటర్ నిర్వహిస్తున్నారన్నారు. అయితే ఇక్కడ వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో తాము దాడులు నిర్వహించామన్నారు. అక్కడ విటులను రప్పించి వ్యభిచారం చేయిస్తున్నట్లు తేలిందన్నారు. సెంటర్‌ను నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి



కుప్పంరూరల్, జూన్ 26 ప్రభాతవార్త: యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని కుప్పం డిగ్రీ కాలేజ్ వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ సూచించారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మంచి నడవడికతో తమ భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలని మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, అధ్యాపకులు ఆనంద్‌కుమార్, సుబ్రమణ్యం, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ నగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెద్దపంజాణి జూన్26 ప్రభాతవార్త : యువత గంజాయి, మద్యానికి ఇతర మాదకద్ర వ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై టి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం అంర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల(డ్రగ్స్)రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చేందుకు యువత తమవంతు సహకారం అందించాలన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు ఈ సందర్భంగా ప్రభుత్వపాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు కలసి వైయస్ఆర్ విగ్రహం నుండి జాతీయరహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు

### - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఓజిలి, జూన్ 26 ప్రభాతవార్త: రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముమ్మాయిపాలెం గ్రామంలో ఎంపిడిఓ రజనీకాంత్, సర్పంచ్ శంకు సుజాత, వైసీపీ నాయకులు శంకు మహేంద్ర, మాచవరం ఎంపిటిసి సభ్యురాలు నిమ్మతి సంధ్యారాణి, వైసీపీ యువనాయకులు నిమ్మతి వెంకటేష్, పిండుకూరు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఘనస్వాగతం పలికారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా సాగింది. అనంతరం ఎమ్మెల్యే సంజీవయ్య ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రజనీకాంత్, సీఐ వైవీ సోమయ్య, ఎస్ఐ డి.ఆదిలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ సుమన్‌రెడినడ, ఏపీవో ఉషారాణి, ఏపీఎం, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, ముమ్మడి సుబ్బారావు యాదవ్, గుడ్ల వెంకటరెడ్డి, పాదర్తి హరినాథ్‌రెడ్డి, కుందాం సొసైటీ అధ్యక్షులు రాజారాంరెడ్డి, జరుగుమల్లి బాబిరెడ్డి, గోపాల్‌రెడ్డి, దామోదర్‌రాజు, గ్రద్దగుంట ఎం.ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేదురుమల్లి కుటుంబాన్ని విమర్శించే అర్హత ఎమ్మెల్యే ఆనంకు లేదు

### - జిల్లా వైసీపీ సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ

వెంకటగిరి, జూన్ 26, ప్రభాతవార్త: నేదురుమల్లి కుటుంబాన్ని విమర్శించే అర్హత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి లేదని జిల్లా వైసీపీ సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. వెంకటగిరిలో నేదురుమల్లి నివాసగృహంలో వైసీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనం ఉన్న మూడు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో అవినీతి ఎక్కువగా జరిందని చెప్పారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ కూడా అమ్ముకున్నట్లు విమమర్శించారు. ఆనం హయాంలో పార్టీకి కార్యకర్తలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. పట్టణంలో ఇల్లు కట్టాలంటే ఎమ్మెల్యే కప్పం కట్టాలని తెలిపారు. మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా మనో వ్యధకు గురైనట్లు ఆరోపించారు. ఆనం సీఎం జగన్ తరువాత రాక్షసుడిని పంపినట్లే కార్యకర్తలు భావిస్తున్నట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో ఆనం ఎక్కడ పోటీ చేసినా ఓటమి తప్పదన్నారు. ఈ సమావేశంలో వైసీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు సురేష్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ వహీదా చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాసంస్థలకు ఎంపికైన శ్రీసింహపురి కోచింగ్ సెంటర్ విద్యార్థులు





గూడూరు, జూన్ 26 ప్రభాతవార్త: గూడూరు రెండో పట్టణ పరిధిలోని సింహపురి కోచింగ్ సెంటర్ విద్యార్థులు నవోదయ ఎంట్రెన్స్ ఫలితాల్లో సత్తా చాటారు. గూడూరు పట్టణం మొత్తంమీద ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులందరిలోనూ టాపర్లుగా నిలిచారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు నవోదయ విద్యాసంస్థల్లో నోటిఫికేషన్ పడింది. ఈ నేపథ్యంలో గూడూరులోని సింహపురి కోచింగ్ సెంటర్ విద్యార్థులు తరుణి, ధనుష్ పరీక్షలు రాసి ఎంట్రెన్స్‌లో ఎంపికయ్యారు. విద్యార్థి జావిద్‌బాషా 300 మార్కులకు గాను, 297 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. మ్యాథ్స్‌లో 100కి 100, సైన్స్‌లో99, సోషల్‌లో 100కి 98 మార్కులు సాధించారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకులు సాయి సురేష్ మాట్లాడుతూ ఇప్పటికే తమ కోచింగ్ సెంటర్ విద్యార్థులతో స్పీడ్ మ్యాథ్స్‌లో ఎవరూ సాటిరారని చెప్పారు.

## జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

ఓజిలి, జూన్ 26 ప్రభాతవార్త :ఓజిలి మండలం మాచవరం, ముమ్మాయిపాలెం గ్రామాల్లోని పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం ఎమ్మెల్యే సంజీవయ్య పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రజనీకాంత్, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి, బాబురావు, మునిప్రసాద్, ఆషా, ఎంపిటిసి నిమ్మతి సంధ్యారాణి, సర్పంచ్ పిండుకూరు మౌనికరెడ్డి, నాయకులు మధురెడ్డి, సర్పంచ్ శంకు సుజాత, నాయకులు శంకు మహేంద్ర, నిమ్మతి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



సూళ్లూరుపేట, జూన్ 26 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని గోకుల కృష్ణ ఫార్మశీ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎస్ఇబి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే దుష్ప్రభావాలు ఎలా ఉంటాయనేది వివరించారు. అనంతరం విద్యార్థులచే స్థానిక బస్టాండ్ వద్ద ప్రదర్శన నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్ఐ రవిబాబు, శ్రీనివాసరెడ్డి, శశికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ డి.సూర్యనారాయణ, గోకులకృష్ణ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బలగాని పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలో తిరిగి చేరిన తడ మండల మాజీ ఎంపిపి వర్గీయులు



తడ, జూన్ 26 ప్రభాతవార్త: తడ మండలం రామాపురానికి చెందిన మాజీ మండలాధ్యక్షురాలు చెంగిని సెల్వి కుటుంబం సోమవారం తెలుగుదేశం పార్టీలో తిరిగి చేరారు. నారా లోకేష్ పాదయాత్ర జరుగుతున్న ప్రదేశానికి తడ మండల టిడిపి నాయకులతో కలిసి వెళ్లిన సెల్వి కుటుంబ సభ్యులు రమేష్, మోహన్, తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన్ శ్రీధర్, తడ మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, జాలర్ల సంఘం నాయకులు బొమ్మన్ పలణి, పార్టీ నాయకులు బోడిలింగాలపాడు రామ్మూర్తి, చిట్టేటి మునీంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి




కోట, జూన్ 26 ప్రభాతవార్త: మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ మత్తుపదార్థాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలో లేనంత యువత మన దేశంలో ఉందని, అలాంటి యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి వారికున్న శక్తి నిర్వీర్యమై భారతదేశం ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండాపోతోందన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాధవయ్య, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు బానిస కారాదు

### – ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావు

వెంకటగిరి, జూన్ 26, ప్రభాతవార్త: యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని స్పెషల్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. మాదకద్రవ్యాలను నిర్మూలించాలని వెంకటగింరి పట్టణ పుర వీధుల్లో పోలీసులు, ఎస్ఈబి సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ చేశారు. కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస అవుతున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలకు బానిసైన 20 మంది విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ నుంచి వైసీపీలో చేరికలు



నాయుడుపేట, జూన్ 26 ప్రభాతవార్త: టిడిపి నాయకుడి ముఖ్య అనుచరుడు జిలానీ బాషా, మాజీ కోఆప్షన్ సభ్యురాలు నస్రీన్‌వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సమక్షంలో చేరారు. సుమారు ఐదుగురు టిడిపి నాయకులు వైసీపీలో చేరారు. పార్టీలో అందరికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు.

## గొల్లపాలెంలో మంత్రికి తేనేటి విందు



వాకాడు, జూన్ 26, ప్రభాతవార్త: కేంద్ర ఐటి సహాయ మంత్రి దేవ సింగ్ చౌహాన్‌కు ప్రముఖ పారిశ్రామికవేత్త కాంట్రాక్టర్ సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి నివాసంలో తేనేటి విందు ఇచ్చారు. సోమవారం వాకాడు మండలం తూపిలిపాలెంలోని ఎన్ఐటిని మంత్రి దేవ్ సింగ్ చౌహాన్ పరిశీలించారు. వాకాడు గొల్లపాలెం గ్రామంలోని స్థానిక ప్రజలతో మంత్రి మాట్లాడుతూ రానున్న 24 సంవత్సరంలో కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా బిజేపి జెండా ఎగరవేయడానికి ఇప్పటి నుండే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, గూడూరు ఇంచార్జి అధ్యక్షులు పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, సన్నా రెడ్డి విజయ్ రెడ్డి, నందగోపాల్ రెడ్డి, చంద్రభూషణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి దేవసింగ్ సోహన్‌కు ప్రసాద్ రెడ్డి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన

వాకాడు, జూన్ 26, ప్రభాతవార్త: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ పై సెబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసన్న లక్ష్మి, వాకాడు ఎస్ఐ రఘునాథ్ అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రమైన వాకాడులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా సమావేశం నిర్వహించారు. సెబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువే లక్ష్యంగా పెట్టుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. ఎస్ఐ రఘునాథ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకువచ్చి అత్యున్నత స్థాయిలో విద్యార్థులు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆ మూడు పార్టీల వలనే పోర్టు ఆగింది

### మాజీ మంత్రి చింతామోహన్

వాకాడు, జూన్ 26, ప్రభాతవార్త: జాతీయ స్థాయిలో బిజేపి, ప్రాంతీయ పార్టీలు టిడిపి, వైసిపి పార్టీలు వలనే దుగరాజపట్నం పోర్టు ఆగిపోయిందని మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించాడు. సోమవారం వాకాడు తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో చింతామోహన్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దుగరాజపట్నం ప్రాంత పరిసరాల ఏరియాలో పేద బడుకు బలహీన వర్గాలు అభివృద్ధి చెందే వారన్నారు. కేవలం చంద్రబాబు నాయుడు వెంకయ్య నాయుడు, వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డి పోర్టును ఆపారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దుగరాజపట్నం పోర్ట్ పనులు ప్రారంభం జరుగుతుందని ధీమా వ్యక్తం చేసారు. వెంకటగిరి కాంగ్రెస్ ఇంచార్జ్ పంట శ్రీనివాసరెడ్డి, పూల చంద్రశేఖర్, తిరుమూరు మస్తానయ్య, బండి భాస్కర్ రెడ్డి, దుంపల నాగరాజు, నాగభూషణం, ప్రవీణ్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిల్లకూరు ఎంపిడిఓగా జికె. నిర్మల దేవి

చిల్లకూరు, జూన్ 26, ప్రభాతవార్త: చిల్లకూరు ఎంపిడిఓగా జికె నిర్మల దేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె చిత్తూరు జిల్లా ఐరాల మండల ఎంపిడిఓగా పని చేస్తూ బదిలీ కావడం జరిగింది. ముందుగా రాష్ట్ర ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. బాధ్యతలు చేపట్టిన నిర్మాల దేవిని మండల అధ్యక్షురాలు తుపాకుల వెంకటరమణమ్మ, మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరందామ రెడ్డి, ముత్యాలపాడు గ్రామ సర్పంచ్ సెనగ హరిత నిర్మలా దేవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి దాసరి రాజమాణిక్యం, ఏఓ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి ప్రసన్న ఉన్నారు.

## చిన్నతనం నుంచే మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

### - విద్యార్థులకు అవగాహన



తడ, జూన్ 26 ప్రభాతవార్త: విద్యార్థులు చిన్నప్పటి నుంచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తడ ఎస్ఐ జె.పి.శ్రీనివా సరెడ్డి పేర్కొన్నారు. మంచి అలవాట్లను నేర్చుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే పిల్లల భవిష్యత్ ఎంతో బాగుంటుందన్నారు. తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ఐటిఐలలో సోమవారం పోలీసులు, సెబ్ అధికారులు కలిసి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ అధికారులు కూడా విద్యార్థులతో మాట్లాడి మాదవ ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు.

# జిల్లా పర్యావరణ ప్రణాళిక సమగ్రంగా సిద్ధం చేయాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి కలెక్టరేట్, జూన్ 26 ప్రభాతవార్త : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన భాధ్యత మన అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంబంధిత శాఖలు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ద్వారా కాలుష్యం నివారణ కొరకు ధ్వని, వాయు తదితర కాలుష్య నివారణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలకు అనుగుణంగా నివేదికలు తయారు చేసి జిల్లా పర్యావరణ ప్రణాళికల సిద్ధం కొరకు జిల్లా కాలుష్య నియంత్రణ మండలికి సాయంత్రం నాటికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ అధికారి నరేంద్ర బాబు వారితో కలిసి జిల్లా పర్యావరణ ప్రణాళిక సిద్ధం చేసే అంశం పై ముఖ్యమైన 16 శాఖల జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన అన్ని జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పర్యావరణ ప్రణాళికలను సిద్ధం చేయాల్సిన ఆవశ్యకత ఉన్నదని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు ఇచ్చిన నమూనా టెంప్లెట్‌లలో అవసరమైన సమాచారం ఘన వ్యర్థాల నిర్వహణ, ద్రవ వ్యర్థాల నిర్వహణ, శబ్దకాలుష్యం, త్రాగునీటి వనరుల కాలుష్యం, వాహన కాలుష్యం, ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణ, మైనింగ్, అటవీ శాఖ కార్యకలాపాలపై నివేదికలు సిద్ధం చేసి రేపు సాయంత్రం నాటికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమాచారం ఆధారంగానే జిల్లా పర్యావరణ ప్రణాళిక తయారు అవుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. అటవీ శాఖ వారు మొక్కలు నాటడం పై పూర్తి స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని, పాఠశాల ఆవరణంలో, ఇంటి ఆవరణలో చెరువు గట్లపైన తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటడం పై డ్వామా, హార్టికల్చర్ అధికారులతో సమన్వయంతో చేపట్టాలని, విద్యార్థి దశ నుండే పిల్లలకు మొక్కలు నాటడం, వాటి నిర్వహణ బాధ్యత తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సక్రమంగా లైఫ్ కార్యక్రమం అమలు జరిగేలా చూడాలని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు పంచాయితీలు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, సంపద కేంద్రాలను ఏర్పాటు, వాటి నిర్వహణ సక్రమంగా జరిగేలా చూసి కాలుష్యానికి తావు లేకుండా చూడాలని అన్నారు. మైనింగ్ శాఖ శబ్ద, వాయు కాలుష్యం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, రవాణా శాఖ, వారు వాయు కాలుష్యం లేకుండా సంబంధిత ధ్రువ పత్రాలు ఉండేలా చూడా లని సూచించారు. ఆసుపత్రుల నుండి వెలువడే వ్యర్థాల నిర్వహణ జాగ్రత్తగా చేపట్టాలని మున్సిపల్, పంచాయితీ శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్‌డబ్ల్యూఎస్ విజయ కుమార్, జిల్లా పంచాయితీ అధికారి రాజశేఖర్ రెడ్డి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి సీతారామరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా గనులశాఖ అధికారి ప్రకాష్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, వివిధ పట్టణాల మున్సిపల్ కమిషనర్లు, ఈఈ జలవనరుల శాఖ, అటవీ శాఖ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ పాదయాత్రలకు ప్రజాస్పందన కరువు



వాకాడు, జూన్ 26 ప్రభాతవార్త: నారా లోకేష్ పాదయాత్ర, జనసేన పవన్ కళ్యాణ్ వారాహికు ప్రజాస్పందన కరువని తిరుపతి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి, రామ్ కుమార్ రెడ్డి ఎద్దేవ చేసారు. సోమవారం వాకాడులోని ఆయన నివాసంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పాటు. ఇప్పుడు జరుగుతున్న గూడూరు నియోజకవర్గంలో కూడా లోకేష్ పాదయాత్రలో ప్రజాస్పందన లేకపోవడం రామ్ కుమార్ రెడ్డి విమర్శించారు. జనసేన వారాహికి ఆ రెండు జిల్లాలకే పరిమితం అని ఎద్దేవా చేశారు. 175 సీట్లుకి 175 స్థానాలు గెలుపొందడం భారతదేశంలోనే జగనన్న చరిత్రలో నిలబడతారన్నారు. ఎన్నికల తర్వాత మరొకసారి జగనన్న సీఎం కావడం తథ్యమన్నారు. వెంకటగిరిలో లోకేష్ పాత యాత్ర అనంతరం టౌన్ సమీపంలో ఉన్న ఇద్దరు టిడిపి వ్యక్తులు భోజనాలు ఏర్పాటు చేసిన మనుషులే లేరన్నారు. పాదయాత్ర ఎంత వరకు సక్సెస్ అయిందో వారికే విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, పాపా రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, జడ్పిటిసి రౌతు రామకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటరమణయ్య, ఎంపిటిసి కృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి మధుసూధన్ రెడ్డి, సర్పంచులు మధుసూధన్ రెడ్డి, నాగరాజు, వెంకటరత్నం, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా అవినీతిని ప్రజలకు వివరించండి

**-ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పోరాటం చేయండి -మాజీ మంత్రి అమరనాథరెడ్డి**




పలమనేరు,జూన్ 26 ప్రభాతవార్త: వైకాపా ప్రభుత్వ అవినీతిని ఎండ గడుతూ ప్రజలకు వాస్తువాలను వివరించాలంటు మాజీ మంత్రి అమరనాథరెడ్డి టిడిపి శ్రేణులకు సూచించారు.స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు చేస్తున్న అక్రమాలను అడ్డుకొని వారు చేస్తున్న అవినీతిని ఎక్కడికక్కడ ఎండగట్టాలని సూచించారు.రాజకీయ నాయకులు పోరాటం చేస్తేనే నాయకత్వం వస్తుందనే అంశాన్ని గుర్తించుకోవాలని తెలిపారు.ప్రతి పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాటానికి టిడిపి సిద్దంగా ఉందని తెలిపారు.తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ప్రవేశ పెట్టిన మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి విస్తృతం చేయాలని సూచించారు.ఇప్పటి వరకు వైకాపా చేస్తున్న చీకటి రాజకీయాలు,వైకాపా ప్రభుత్వంలో ఏపి పరిస్థితులను ప్రజలకు వివరిచాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ఆనంద్, సోమశేఖర్, కుట్టి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజల సమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత

## త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు : ఎస్పి



తిరుపతి క్రైం, జూన్ 26 ప్రభాత వార్త :స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజల సమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎస్పి కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 75 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులందరితో ఎస్పి మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబం కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. స్పందన ఫిర్యాదులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, ఫిర్యాదులను చట్టప్రకారం విచారణ జరిపించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.

## అంగరంగ వైభవంగా ద్రౌపది అమ్మవారికి పుష్పయాగం



రామచంద్రాపురం, జూన్ 26 ప్రభాతవార్త: అంగరంగ వైభవంగా ద్రౌపధి అమ్మవారికి సోమవారం పుష్పయాగం నిర్వహించారు. మండలంలోని సి.రామాపురంలో మహాభారత ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని పుష్పయాగం నిర్వహించారు. పూజారి చంద్రశేఖర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు బెంగుళూరు నుండి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలను ప్రత్యేకంగా తీసుకువచ్చారు. గ్రామదేవత శ్రీవిరూపాక్షమ్మ ఆలయంలో పుష్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుగా ద్రౌపధి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. పూజారి మురగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ పుష్పయాగంలో పరిసర గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు దర్శన ఏర్పాట్లు గావించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## చల్లేశ్వర,చక్రేశ్వరస్వామి కుంబాభిషేకానికి అంకురార్పణ



శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా ఉన్న రెండు ఆలయాలకు కుంబాభిషేకం నిర్వహించుటకు సోమవారం అంకురార్పన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. పట్టణంలోని చక్రేశ్వర స్వామి, చల్లేశ్వరస్వామి ఆలయాల జీర్ణోద్ధారణ కార్య క్రమాలను పూర్తి చేసారు. అనుబంధ ఆలయాలను అభివృద్ధికి సంబంధించి ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఎంఎల్ఏ బియ్యపు మధుసూదనరెడ్డితో చర్చించి నిధులుమంజూరు చేయించారు.పనులు చక చకా చేయించారు.ఈ ఆలయాల కుంబాభిషేకం కార్యక్రమాలను సోమవారం చేపట్టారు.ఆలయ సంప్రదాయం స్థానిక ఆచారాల మేరకు ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాధన్, పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదపండితులు పూజలను నిర్వహించారు.ప్రత్యేక గుడారాలు,హోమాలు ఏర్పాటు చేసారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ హాజరుకాగా అంకురార్పణ పూజలు నిర్వహించారు.మూడు రోజులు పూజల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.ఇంకా ఎనిమిది ఆలయాల కుంభాభిషేకాలు నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో ఛైర్మెన్‌తోపాటు ఎసి మల్లికార్జున్ ప్రసాద్,ఎఇఒ లోకేష్‌రెడ్డి,సూపరింటెండెంట్ శ్రీహరి,సుబ్బరాయులు,కోళ్ళూరు హరినాయుడు, స్వర్ణమూర్తి, రవి,పసల కుమారస్వామి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్,కరుణాకర్ గురుకుల్ పాల్గొన్నారు.

## తాళాలు వేసిన ఇంటిలో చోరీ

**-రూ.30లక్షల నగదు,బంగారు చోరీ**

పలమనేరు,జూన్ 26,ప్రభాతవార్త: తాళాలు వేసిన ఇంటిలో రూ.30లక్షలు విలువ చేసే బంగారు,నగదు చేరీ జరిగిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది.పట్టణంలోని కప్పల వీరా స్వామి వీధిలో ఉంటున్న మాజీ కౌన్సిలర్ అశోక్‌కుమార్ మూడు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి బెంగళూరుకు వెళ్లారు.సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ చంద్రశేఖర్ క్లూస్ టీం సహాయంతో ఆధారాలను సేకరించారు .సుమారు రూ.7లక్షల నగదు,రూ.23లక్షల విలువ చేసే బంగారం చోరీకి గురైనట్లు ప్రధమికంగా నిర్ధారించిన పోలీసులు కేసు ధర్యాప్తు చేస్తున్నారు.

# నాపై చేసిన ఆరోపణలు నిరూపించండి

**- ఒక్కటి నిజమని తేలినా రాజీనామా చేస్తా**
**- కాదంటే మీరు దేశం వదిలి వెళ్లిపోతారా**
**- నారా లోకేష్ చేసిన విమర్శలపై ఎమ్మెల్యే సంజీవయ్య ఆగ్రహం**



నాయుడుపేట, జూన్ 26 ప్రభాతవార్త : తనపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేసిన ఏ ఒక్క ఆరోపణ నిజమైనా తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. కాదంటే మీరెక్కడికి వెళ్ళిపోతారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. నాయుడుపేటలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. తాను ఇసుక, గ్రావెల్, గుట్కా తదితర వాటిల్లో పాత్రధారుడినని నారా లోకేష్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకుంటున్నారని, ఏమాటా తప్పలేదన్నారు. అదే విధంగా నువ్వు మీ నాన్న చంద్రబాబు చేసే జిమ్మిక్కులను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మామను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును, ఆయన కొడుకువైన నిన్ను జనాలు ఎలా నమ్ముతారని ప్రశ్నిం చారు. లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని బాడీ తగ్గడానికి చేస్తున్న వాకింగ్‌లా ఉందన్నారు. మధ్యాహ్నం దాకా నిద్రపోయి సాయంత్రం నుంచి నడుచుకుంటూ దాన్ని యువగళం పాదయాత్ర అని చెప్పడంపై జనాలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ముందు లోకేష్ తెలుగు నేర్చు కోవాలని హితవు పలికారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ తల్లి పేరు సరిగ్గా పలకలేకపోయారని గుర్తు చేశారు. నీ భాష ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని దత్తపుత్రుడితో కలిసి వచ్చినా, ఎవరితో వచ్చినా ఏమీ చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎన్‌డిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, నాయకులు కలికి మాధవరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, అశోక్, సాదు శాంతి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐటిని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి



వాకాడు, జూన్ 26 ప్రభాతవార్త : వాకాడు మండలం తూపిలిపాలెం గ్రామంలోని సోమవారం బంగాళా ఖాతం సమీపంలో నిర్మిస్తున్న ఎన్ఐటిని కేంద్ర ఐటి సహాయ మంత్రి దేవ సింగ్ చౌహాన్ పరిశీలించారు. ఎన్ఐటికు సంబంధించిన అధికారుల ద్వారా వివరాలు మంత్రి అడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న నిర్మాణం పనులను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. మంత్రి వెంట ఎన్ఐటి చీఫ్ శరవణ్, సిపిడబ్ల్యూ జేఈ విజయ్ కుమార్, జిల్లా బిజేపి అధ్యక్షులు దయాకర్ రెడ్డి, బిజెపి గూడూరు ఇంచార్జి పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, బిజేపి మండల అధ్యక్షులు వల్లి ప్రసాద్, తహాశీల్దార్ నరసింహారావు, పలువురు బిజేపి నాయకులు, అనంతరం తుపిలి పాలెం గ్రామంలోని మత్స్యకారులతో సమావేశమై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## నారా లోకేష్ బసకు ఏర్పాట్లు



కోట, జూన్ 26 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం రాత్రి కోటకు చేరుకోనుంది. ఆ మేరకు కోట క్రాస్‌రోడ్డు వద్ద లోకేష్ బస చేయనున్నారు. అందుకు సోమవారం ఆ పార్టీ నాయకులు ముళ్లపొద ఉన్న ఓ ప్రాంతాన్ని శుభ్రపరిచే క్రమంలో జేసిబి సహాయంతో చెట్టుపుట్టలను తొలగిస్తున్నారు. కోటలో 28వ తేదీన జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు ఇప్పటికే కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలగాటి భాస్కర్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి, కోటేశ్వరరెడ్డి, మధుసూదన్‌యాదవ్, జితేంద్రరెడ్డి, గండవరం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉచిత అర్జీలు రాసే కార్యక్రమానికి శ్రీకారం



గూడూరు, జూన్ 26 ప్రభాతవార్త : గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారానికి వచ్చే వారికి అర్జీలు రాసిచ్చే ప్రక్రియకు సోమవారం నుంచి శ్రీకారంచుట్టారు. అర్జీలు రాయించుకునేందుకు గతంలో నిరక్షరాస్యులు ఇబ్బందులు పడేవారు. అర్జీలు రాయించుకున్న oదుకు కొంత మొత్తం నగదు చెల్లించడం జరుగుతుంది. అయితే గత వారం అర్జీదారుల నుంచి అర్జీలు రాసే వారు అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారని ఆర్డీఓకు ఫిర్యాదు అందిన వెంటనే ఆయన స్పందించారు. నేరుగా అర్జీలు రాసే వారి వద్దకు వెళ్లి అదిక మొత్తంలో నగదు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అర్జీదారులు మోసపోకుండా ఉండేందుకు ఉచిత అర్జీలు రాసే కార్యక్రమం వచ్చే సోమవారం నుంచి మొదలుపెడతామని ప్రకటించిన ఆయన ఆ మాటను నిలబెట్టుకుంటూ సోమవారం ఉచిత అర్జీలు రాసే కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులు, నిరక్షరాస్యులు మధ్యవర్తుల ద్వారా అర్జీలు రాయించుకొని డబ్బులు చెల్లించకుండా తమ కార్యాలయం నుంచే ఉచితంగా అర్జీలు రాయించుకోవచ్చని తెలిపారు. ఇందుకుగాను సచివాలయాల్లోని వాలంటీర్లు అర్జీలు రాసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. గూడూరు మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌డిసిబి డైరెక్టర్‌కు ఎంఎల్‌సీ మురళీధర్ పరామర్శ



కోట, జూన్ 26 ప్రభాతవార్త: కోట మండలం విద్యానగర్‌లో ఎన్‌డిసిసిబి డైరెక్టర్ నరమాల వెంకట రమణయ్యను సోమవారం ఎంఎల్‌సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. ఇటీవల నరమాల వెంకట రమణయ్య మనవరాలు అక్షిత అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎంఎల్‌సీ మేరిగ మురళీదర్ రమణయ్య నివాసానికి వెళ్లి అక్షిత చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన వెంట వైసీపీ తిరుపతి పార్లమెంటు నాయకులు మొబిన్‌బాషా ఉన్నారు.

## పోలీస్ స్పందనకు 17 సమస్యలు

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి 17 మంది అర్జీదారులు సమస్యలను అడ్మిన్ ఎఎస్పీ సుధాకర్‌కు విన్నవించుకొన్నారు. స్పందన కార్యక్రమానికి హాజరైన అడ్మిన్ ఎఎస్పీ సుధాకర్ అర్జీదారుల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి వాటిని సత్వరం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూ సమస్యలపై 8, ఆస్తి తగాదాలపై 4, వేధింపులపై 2, మిస్సింగ్, ఆస్తి తగాదాలపై ఒకొక్క ఫిర్యాదు అందింది.

## ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించిన ఎస్పీ రిశాంత్‌రెడ్డి



చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త: చిత్తూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను ఎస్పీ రిశాంత్‌రెడ్డి సోమవారం గాంధీ సర్కిల్ ఆవరణలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ రద్దీ అధికం కావడంతో ట్రాఫిక్ క్రమబద్దీకరణ కోసం సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగర పరిధిలో ట్రాఫిక్ అధికంగా వుండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను పూర్తి స్థాయిలో క్రమబద్దీకరణకు చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాధరెడ్డి, ట్రాఫిక్ డిఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

## సవ్యసాచి దివ్యదర్శనం



శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం అర్జునుడు దివ్యదర్శనం ఇచ్చారు.మత్స్య యంత్రచ్ఛేదనం కార్యక్రమాల్లో భాగంగా అర్జున సమేత ద్రౌపదీదేవి, కృష్ణుడు ఉత్సవర్లను కన్నుల పండువగా ముస్తాబు చేశారు. ఆలయం వద్ద గల అలంకార మండపంలో అలంకార గురుకుల్ చక్కగా ముస్తాబు చేశారు. పట్టణంలోని జయరామారావువీధి, తేరువీధి, బజారువీధి,నగరి వీధి, నెహ్రూవీధుల గుండా ఊరేగింపు సాగింది. ఉత్సవంను ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు ఆదేశాలతో డెప్యూటి ఇఓ వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు. ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్, చిన్న ఆలయాల ఇన్‌చార్జి వెంకటస్వామి సారథ్యంలో ఉత్సవం సాగింది, పూజారి దయానందం, పురుషోత్తం ఉభయదారులు కెవియస్‌నాయుడు కుటుంబసభ్యులు, గుప్తామెడికల్స్ అధినేత టి.జి ప్రభాకర్ గుప్తా కుటుంబసభ్యులు హాజరయ్యారు.

# స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయండి

**తిరుపతి స్మార్ట్ సిటీ అడ్వైజరి ఫారమ్ సమావేశంలో ఎమ్మెల్యే భూమన, ఎంపి గురుమూర్తి**




తిరుపతి కార్పొరేషన్, జూన్ 26 ప్రభాతవార్త : తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిటీ లెవల్ అడ్వైజరీ ఫోరమ్ సమావేశం సోమవారం తిరుపతి నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, జనరల్ మేనేజర్ చంద్రమౌళి, కమిటీ సభ్యులు కైలాష్, శ్రీనివాసరావు, మంగాటి గోపాల్ రెడ్డిలు పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ తిరుపతి స్మార్ట్ సిటీ తరపున జరుగుతున్న వినాయకసాగర్, సిటీ ఆపరేషన్ సెంటర్ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్ మార్గంలో రైల్వే లైన్ పై ప్రజలు నడిచేందుకు నిర్మించే బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని, నగరంలో టాయిలెట్స్ నిర్వహణ చక్కగా నిర్వహించాలన్నారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పనులు చక్కగా సాగుతున్నాయని, ప్రజలకి ఉపయోగపడే ప్రాజెక్టులు తీసుకురావడం అభినందనీయమన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ మెనేజింగ్ డైరెక్టర్ హరిత మాట్లాడుతూ జాతీయ స్థాయిలో స్మార్ట్ సిటీ మిషన్ ఏర్పడి 8 సంవత్సరాలు అయిందని, తిరుపతి స్మార్ట్ సిటి మిషన్ 2016 నవంబర్ నెలలో ఏర్పడిందని, ఇప్పటి వరకు 1618 కోట్ల విలువైన 97 పనులు మంజూరు చేయబడినవని, ఇందులో 187 కోట్ల విలువైన 60 పనులు పూర్తి కాబడిందని, 1431 కోట్ల విలువైన 37 పనులు పురోగతిలో వున్నాయన్నారు. టిటిడి భాగస్వామ్యంతో పూర్తి కాబోతున్న శ్రీనివాస సేతు ఎలివేటర్ కారిడర్, వినాయక సాగర్ ప్రాజెక్టు, సిటీ ఆపరేషన్స్ సెంటర్, ఇంటిగ్రేటెడ్, కమాండ్ కంట్రోల్ సెంటర్, మల్టిలెవల్ కార్ పార్కింగ్ మొదలైన ప్రాజెక్టులు నగర ప్రజలతో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నగర పాలక సంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండి హరిత వివరించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్కె బాబు, కార్పొరేటర్ ఆంజినేయులు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.